గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

శ్రీ వై.యస్. జగన్మోహన్ రెడ్డి గారి ప్రసంగం

ఆంధ్రప్రదేశ్ శాసనసభ

అధ్యక్షా...

ఒక రాష్ట్రంగా మనం ఎంతటి అన్యాయానికి గురయ్యామో ఈ ప్రకటనద్వారా ఈ సభ దృష్టికి తీసుకురాదలుచుకున్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మెజార్టీ ప్రజల అభిప్రాయాలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఈ రాష్ట్రాన్ని దుర్మార్గంగా విభజించారు. ఇలాంటి విభజన వల్ల కొత్త ఆంధ్రప్రదేశ్ ఇటు ఆర్థికంగా, నిప్పులమీద నడవాల్సి వస్తుందని, ఉద్యోగాల విషయంలో పూర్తిగా నష్టపోతామని, అన్ని రంగాల్లో నష్టపోతామని తెలిసి కూడా విభజన విషయంలో మొండిగా  ముందుకు వెళ్లిన విషయం మన అందరికీ తెలుసు.

రాష్ట్ర విభజన నష్టాలను ప్రత్యేక హోదా సాధన ద్వారానే అంతో ఇంతో పూడ్చుకోగలుగుతాం. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా ఇవ్వండి అని ఈ అసెంబ్లీ సాక్షిగా మరోసారి ఎందుకు ఈ తీర్మానం చేయాల్సి వస్తోందంటే... గతంలో ఈ అసెంబ్లీలో ప్రత్యేక ప్యాకేజీకి ధన్యవాదాలు చెపుతూ అదేపనిగా ఇదే సభలో గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల... అయ్యా మాకు ఆ ప్యాకేజీ వద్దు, హోదాయే కావాలి అని మరోసారి ఇదే అసెంబ్లీ నుంచి తీర్మానాన్ని పంపుతున్నాం. గత అయిదేళ్ళలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని గత ప్రభుత్వం సరిదిద్దకపోగా, ఆ అన్యాయాలు మరింతగా పెరగటానికి కారణమయ్యింది. కాబట్టే ఈ రోజు మనమంతా ఇంతటి పోరాటాన్ని చేయాల్సి వస్తోంది.

విభజన ఫలితంగా మనం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దాదాపు 59 శాతం జనాభాను,  అప్పు-చెల్లింపు బాధ్యతలను వారసత్వంగా పొందాం. కానీ 47 శాతం ఆదాయం మాత్రమే పొందాం. ఆదాయాన్నీ, ఉద్యోగాల్ని ఇచ్చే రాజధాని నగరం

లేకుండా, అతితక్కువ మౌలిక సదుపాయాలతో మానవ, ఆర్థిక అభివృద్ధి సూచికల్లో వెనకబడి వ్యవసాయ రాష్ట్రంగా మిగిలిపోయాం.

2015-2020 సంవత్సరాల మధ్య కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాను పరిగణనలోకి తీసుకున్నాక ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రానికి రెవెన్యూ లోటు రూ.22,113 కోట్లు ఉంటుందని, కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి డివల్యూషన్ తర్వాత రెవెన్యూ మిగులు రూ.1,18,678 కోట్లుగా ఉంటుందనీ 14వ ఆర్థిక సంఘం అంచనావేసింది. వాస్తవంగా గత 5 సంవత్సరాలలో మన రెవెన్యూలోటు రూ.66,362 కోట్లకు విపరీతంగా పెరిగింది. ఇది 14వ ఆర్థిక సంఘం అంచనా వేసిన మొత్తం కంటే మూడు రెట్లు అధికంగా ఉంది.

హైదరాబాదు గత అనేక దశాబ్దాలలో దేశంలోని అనేక ఇతర రాజధాని నగరాల మాదిరిగానే అత్యుత్తమ ఆర్థిక కేంద్రంగా అవిర్భవించింది. ఇందుకు నిదర్శనం- 2013-2014 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ నుండి రూ.57వేల కోట్ల సాఫ్ట్‌వేర్ ఎగుమతులుగా ఉండగా హైదరాబాదు నగరం ఒక్కటే రూ.56,500 కోట్ల ఎగుమతులను కలిగి ఉంది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ తలసరి ఆదాయం రూ.14,411గా ఉండగా ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ.8,397 గా ఉంది.

కొత్త రాష్ట్రానికి ఉన్న సవాళ్లను ఆర్థిక దుస్థితిని దృష్టిలో ఉంచుకుని 5 సంవత్సరాలపాటు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని సాక్షాత్తూ పార్లమెంటులోనే ప్రకటన చేశారు. దీంతోపాటుగా ఆంధ్రప్రదేశ్‌కు జరగిన నష్టాన్ని నేరుగా ఆర్థిక సహాయం చేయడంద్వారా, అభివృద్ధిపరమైన ప్రోత్సాహకాలు ఇవ్వడంద్వారా, రాయితీలు ఇవ్వడంద్వారా భర్తీచేస్తామని పార్లమెంటులో చెప్పారు.

అయితే, రాష్ట్రాన్ని విభజించే సమయంలో అధికార పార్టీ, అలాగే ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటులో చేసిన వాగ్దానాలు నెరవేర్చలేదు. ఇది రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక, సామాజిక దుస్థితికి దారితీసింది. విభజన సమయంలో రూ.97,000 కోట్లు ఉన్న మన రాష్ట్ర రుణం 2018-19 నాటికి ఈ 5 సంవత్సరాలలో అత్యధికంగా రూ.2,58,928 కోట్లకు చేరింది. రుణంపై వడ్డీ మాత్రమే సంవత్సరానికి రూ.20,000 కోట్లు పైగా ఉంటే, దీనికి అదనంగా అసలు రూపంలో చెల్లించాల్సిన మొత్తం మరొక రూ.20,000 కోట్ల మేరకు ఉంటుంది. అంతే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వినియోగించుకున్న రుణాల కోసం ఇచ్చిన హామీల రూపంలో భారీ కంటింజెన్సీ చెల్లింపు బాధ్యతలు ఉన్నాయి. మరొక వైపు ఉపాధికల్పన సామర్థ్యం గణనీయంగా పడిపోయి మన పిల్లలు ఉద్యోగాల అన్వేషణలో ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు.

ఈ నిరుత్సాహపూరిత పరిస్థితిని పరిశీలిస్తే రాష్ట్రం ఆర్థికంగా, ద్రవ్యపరంగా కోల్పోయిన వాటిని పూరించేందుకు మరియు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు ప్రత్యేక హోదా అనేది తప్పనిసరి. ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రానికి అత్యధికంగా గ్రాంటులు లభిస్తాయి. ప్రత్యేక హోదా రాష్ట్రాలకు కేంద్రం నుంచి ఇస్తున్న గ్రాంటులు తలసరి రూ.5,573 గా ఉంటే, ఆంధ్రప్రదేశ్‌కు లభిస్తున్న గ్రాంటులు తలసరి రూ.3,428 మాత్రమే ఉంది. పైగా ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలకు మాత్రమే ప్రత్యేక ఆదాయపు పన్ను మినహాయింపు, జి.ఎస్.టికి సంబంధించిన మినహాయింపులు, ఇతర రాయితీలు మొదలైనటువంటి ప్రత్యేక పారిశ్రామిక ప్రోత్సాహకాలను అందిస్తున్నందువల్ల ప్రత్యేక హోదా ప్రాముఖ్యతను సంతరించుకుంది. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించాలన్నా, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దారితీసే సత్వతర పారిశ్రామికాభివృద్ధి జరగాలన్నా ప్రత్యేక హోదాద్వారా వచ్చే ప్రత్యేక ప్రోత్సాహకాలు కీలకం.

ప్రత్యేక హోదాతో మాత్రమే మనకు అత్యంత అవసరమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, ఫైవ్‌స్టార్ హోటళ్లు, తయారీ రంగంలో పరిశ్రమలు, ఐటీ సేవలు, అత్యుత్తమ విద్యాసంస్థలు వస్తాయి. ఇవన్నీ వస్తేనే మన రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.

ఒకవైపున నిజం ఇలా ఉంటే ప్రత్యేక హోదా ఇవ్వకపోవడానికి రకరకాల సాకులు, వదంతులు ప్రచారంలో ఉన్నాయి. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకే ప్రత్యేక హోదా ఇవ్వడం లేదనే వాదనలు వినిపించాయి. ఈ వాదనలన్నీ సత్యదూరం. నిజం ఏమిటన్నదది మరోసారి అందరి ముందూ ఉంచుతున్నాను. 14వ ఆర్థిక సంఘం గౌరవ సభ్యుడు ప్రొఫెసర్ అభిజిత్‌సేన్ రాసిన లేఖను నేను మీ ముందు ఉంచుతున్నాను. అందులో 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక కేటగిరీ హోదా రద్దుకు సిఫారుసు చేయలేదని ఆయన స్పష్టంగా వివరించారు. పరిశీలనార్థం ఈ ప్రతిష్టాత్మక సభ సమక్షంలో నేను ప్రవేశ పెడుతున్నాను.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక కేటగిరి హోదాను మంజూరు చేస్తూ 2014, మార్చి, 02 నాటి కేంద్ర మంత్రిమండలి చేసిన తీర్మానాన్ని గుర్తు చేసుకోవడం కూడా ముఖ్యం. ఆ నిర్ణయాన్ని వెంటనే అమలుచేయాలని కూడా నాటి కేబినెట్ ప్రణాళికా సంఘాన్ని ఆదేశించడమయింది. అయితే, ఈ దిశగా గత రాష్ట్ర ప్రభుత్వం ప్లానింగ్ కమిషన్‌తో మాట్లాడి చేయించకపోవడంవల్లనే హోదా అమలుకాలేదు. 1 జనవరి 2015 తర్వాతనే ప్రణాళికా సంఘం రద్దై నీతి ఆయోగ్ ఏర్పడింది.

అనేక ఇతర రాష్ట్రాలు ప్రత్యేక కేటగిరీ హోదాను కోరుతున్నాయనే వాదనలు, అభిప్రాయాలు కూడా వినిపించాయి. అందువలన, ఈ అంశంపై నేను

మాట్లాడదలుచుకున్నా. విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రానికి ఆర్థికంగా, ద్రవ్యపరంగా వచ్చిన ఇబ్బందుల్ని భర్తీచేయడానికి ప్రత్యేక హోదాను ఇస్తామని ముందస్తు షరతుతో ఒక్క ఆంధ్రప్రదేశ్ తప్ప మరే రాష్ట్రాన్నీ భారత పార్లమెంటులో విభజించలేదన్న విషయం ఇక్కడ మన సభ సభ్యులకు, అటు పార్లమెంటు సభ్యులకు కూడా తెలుసు. అన్ని రాష్ట్రాలనుంచి ప్రాతినిధ్యం ఉన్న పార్లమెంటులో అటు పాలక పార్టీ, ఇటు ప్రతిపక్ష పార్టీకూడా దీనికి మద్దతు తెలిపాయి. విభజన కోరుతున్న రాష్ట్రానికి అత్యధిక ఆదాయాన్ని అందించే రాజధానిని ఇవ్వడం చరిత్రలో ఇదే మొదటిసారి. అదే సందర్భంలో అత్యధిక ప్రజలు, తక్కువ ఆదాయం ఉన్న రాష్ట్రం కాబట్టే న్యాయం చేయడానికి ప్రత్యేక హోదా ఇస్తామన్నారు.

ఇక్కడే ఒక ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. హోదా ఇస్తామన్న ముందస్తు హామీతో రాష్ట్రాన్ని విభజించి, ఆ హామీని నిలబెట్టుకోలేని ఆ పార్లమెంటుకు, రాష్ట్రాన్ని విభజించే హక్కు ఉండడం న్యాయమేనా?

ప్రత్యేక హోదానే రాష్ట్రానికి జీవనాడి అని స్పష్టం అయిన నేపథ్యంలో రాష్ట్రానికి ఇక జాప్యం లేకుండా ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందిగా 5 కోట్ల ప్రజల తరపున స్టేట్‌మెంట్ ఇస్తూ ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నాను.